# 68. వ్యామోహం- ఫలం

ఓ మనిషి ఓ తోటలోని సన్నటి కాలిబాట వెంట సన్నగా ఈల వేసుకుంటూ నడుస్తున్నాడు. అకస్మాత్తుగా ఓ చెట్టు చాటునించి అందంగా ఉన్న ఓ మెరుపు తీగ, ఓ చేతిలో విస్కీ బాటిల్‌తో, మరో చేత్తో పేక బొత్తితో అతని ముందుకు వచ్చింది.

"హలో. నాపేరు ఆనందరావు. నువ్వెవరు?" పలకరించి అడిగాడు అతను.

"నా పేరు వ్యామోహం. నీకు ఆనందం ఇచ్చేదంతా నా దగ్గర ఉంది. రా." చెప్పింది వ్యామోహం.

"నాకేం ఆనందం ఇస్తుందో నాకే సరిగ్గా తెలీదు. సరే. అదేమిటో చూద్దాం పద."

వ్యామోహం అతన్ని తామర తూడులు ఉన్న, చల్లటి గాలి వీచే ఓ కొలను పక్కన ఉన్న పచ్చగడ్డి మీదకి తీసుకువెళ్ళింది. ఆ మనిషి శారీరక కోరికలని వ్యామోహం మూడు గంటల పాటు తీర్చింది. ఆ మనిషి తిరిగి ఆ తోటలోని కాలి బాట వెంట నడవసాగాడు. కొద్దిసేపటికి నల్లగా దృఢంగా ఉన్న ఓ ఆగంతకుడు అకస్మాత్తుగా ఆ మనిషికి అడ్డంగా వచ్చి నిలబడ్డాడు.

"ఎవరు నువ్వు?" అడిగాడు ఆ మనిషి.

"నా పేరు కర్మ ఫలం. వ్యామోహాన్ని నువ్వు కలిసావు కదా?" అడిగాడు అతను.

"అవును?"

"వ్యామోహం తీరాక నేను వస్తూంటాను. నేను, వ్యామోహం కలిసి పని చేస్తూంటాం."

"నువ్వేం పని చేస్తావు?"

వెంటనే కర్మ ఫలం ఆ మనిషి మీదకి దూకి అతన్ని బాదసాగాడు. ఎంత ప్రయత్నించినా ఆ మనిషి కర్మ ఫలాన్ని ప్రతిఘటించలేక పోయాడు.

కింద పడ్డ ఆ మనిషిని రకరకాలుగా బాదుతూ కర్మ ఫలం మూడు రోజుల పాటు హింసించాక చెప్పాడు.

"నా పని అయిపోయింది. నేను ఇక వెళ్తాను."

"వ్యామోహం పిలిచినప్పుడు వెళితే ఏం జరుగుతుందో నాకిప్పుడు బాగా అర్థమైంది. నాకు ఇది చెప్పు. నా ప్రమేయం లేకుండా వ్యామోహం తనంతట తానే వచ్చి నన్ను పిలిచింది. అప్పుడు నాది తప్పు ఎందుకవుతుంది?"

"నీకు చెందనిది ఏది నీ దగ్గరకి వచ్చినా, దాన్ని నువ్వు ఉచితంగా స్వీకరిస్తే అది తప్పు. ఆ ఋణం వసూలు చేసుకోడానికి నేను రాక తప్పదు." చెప్పాడు కర్మ ఫలం.

కొద్దిసేపు విశ్రాంతి తీసుకుని తిరిగి ఆ మనిషి నడకని సాగించాడు. కొంచెం దూరం వెళ్ళాక అకస్మాత్తుగా ఇందాకటి యువతి దారిలో నించుని, కవ్వింపుగా చూస్తూ, పిలుస్తూ ఆ మనిషికి కనిపించింది. ఆ మనిషి తల వంచుకుని ఆమె వంక చూడకుండా వెళ్తూ అనుకున్నాడు.

'వ్యామోహానికి చిక్కితే ఏం అవుతుందో కర్మ ఫలం అనుభవించకుండానే తెలుసుకుని, దాన్నించి తప్పించుకోవడమే జ్ఞానం.

## 69. సందేహం

ఓ సారి ఓ సింహం, ఓ ఏనుగు దేవుడి దగ్గరకి ఓ సందేహం తీర్చుకోడానికి వెళ్ళాయి.

"దేవా! నాకున్న బలంలో నూరో వంతు కూడా మనిషికి లేదు. మరి నా కంటే మనిషి ఎందుకు అంత గొప్పవాడు అయ్యాడు?" ఏనుగు అడిగింది.

వెంటనే సింహం దేవుడ్ని ప్రశ్నించింది.

"దేవా! నాకున్న పరాక్రమంలో పదో వంతు కూడా మనిషికి లేదు. మరి అతను నా కంటే ఎందుకు గొప్పవాడు అయ్యాడు?"

"మీరు చెప్పింది నిజమే. శారీరక బలంలో మనిషి మీకన్నా అల్పుడు. మీ ఆకారం, బలం ముందు మనిషి దిగదుడుపే. కాని మనిషి బుద్ధి బలంలో